క్లుప్తంగా

కేజీబీవీని తనిఖీ చేసిన అదనపు కలెక్టర్



విద్యార్థులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే

రామడుగు: మండలంలోని వెదిర కేజీబీవీని మంగళవారం అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే తనిఖీ చేశారు. ఏడో తరగతి విద్యార్థులతో తెలుగు, ఇంగ్లిష్ పాఠాలు చదివించారు. విద్యార్థులు చదవడంలో వెనుకంజలో ఉన్నారని, ఉపాధ్యాయులు శ్రద్ధగా విద్యాబోధన చేయాలని సూచించారు. అనంతరం వంటగదిని, విద్యార్థులకు అందిస్తున్న వంటకాలు, సరుకుల స్టాక్ వివరాలను పరిశీలించారు. మెనూ ప్రకారం ఆహారం అందించాలని సూచించారు. హాస్టల్ గదుల్లోని సౌకర్యాలను తెలుసుకున్నారు. వందశాతం హాజరు ఉండేలా ప్రత్యేకాధికారి కవితకు సూచించారు. అనంతరం రామడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజేశ్వరీ, ఎంపీడీవో రాజేశ్వరీ, ఎంపీవో శ్రావణ్‌కుమార్, ఆర్ఐ కమలేశ్, పాఠశాల సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యాన పంటలతో అధిక లాభాలు



మాట్లాడుతున్న మంజువాణి

ఇల్లందకుంట: ఉద్యానపంటలతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని ఉద్యానశాఖ అధికారి మంజువాణి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఉద్యాన పంటలు, పథకాలపై రైతులకు పలు సూచనలు చేశారు. తక్కువ నీటి సౌలభ్యం ఉన్న ప్రాంతాల్లో ఉద్యానపంటలు పండించాలన్నారు. పండ్లు, పువ్వులు, కూరగాయలు, తీగజాతి పంటలకు మార్కెట్‌లో ఎక్కువ డిమాండ్ ఉందన్నారు. కార్యక్రమంలో ఏఈవో రవళిక, ఆదర్శ రైతు శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.

బ్యాగులు, బుక్స్ అందజేత



బుక్స్, బ్యాగులు అందిస్తున్న సభ్యులు

గన్నేరువరం: మండలంలోని జంగపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులందరికీ సేవా యువత ఫౌండేషన్ సభ్యులు దాతల సహాయంతో మంగళవారం ఉచితంగా బ్యాగులు, బుక్స్, పెన్నులు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకూడదనే ఉద్దేశంతో కార్యక్రమం చేపట్టామని, ముమ్ముందు దాతల సహాయంతో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టి విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించడానికి కృషి చేస్తామని ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. హెచ్‌ఎం, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

'బిర్లా ఓపెన్ మైండ్స్'లో ఇంటర్‌కు అనుమతి



కేక్ కట్ చేస్తున్న చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి

కరీంనగర్‌రూరల్: బొమ్మకల్‌లోని బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు సీబీఎస్‌ఈ నుంచి ఇంటర్మీడియెట్ నిర్వహణకు అనుమతి లభించింది. మంగళవారం స్కూల్‌లో చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి కేక్ కట్ చేసి ఉపాధ్యాయులతో సంబురాలు నిర్వహించారు. ఇంటర్మీడియెట్ నిర్వహణకు అనుమతి రావడం ఎంతో సంతోషంగా ఉందని, అత్యున్నత ప్రమాణాలతో విద్యను అందించే దిశగా కృషి చేస్తామన్నారు. సీనియర్ సెకండరీ తరగతులు ప్రారంభం కావడం పాఠశాల అభివృద్ధిలో కీలక ఘట్టమని తెలిపారు. ప్రిన్సిపాల్ బబితా విశ్వనాథన్ మాట్లాడుతూ, విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవడంలో ఇంటర్మీడియెట్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా విద్యాబోధన చేస్తున్నట్లు వివరించారు.

చెక్కులు పంపిణీ

సైదాపూర్: వెన్నంపల్లిలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడుతిరుపతి, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు రాజిరెడ్డి మంగళవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ప్రజాపాలనలో నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందుతాయని అన్నారు. కార్యక్రమంలో సుమన్, రమేష్, నరసయ్య, రమణ, అయిలయ్య, రాజు, వెంకటయ్య, రవీందర్, మహేష్, సమ్మయ్య ఉన్నారు.



జమ్మికుంట: మొక్కులు చెల్లించుకుంటున్న మహిళలు



రామడుగు: వెలిచాలలో పుట్టలో పాలు పోస్తున్న మహిళలు



మానకొండూరులో పుట్ట వద్ద మొక్కులు చెల్లిస్తున్న మహిళలు



ఇల్లందకుంట: సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహంపై పాలుపోస్తున్న భక్తులు

చల్లంగా చూడు నాగమ్మ

ఇల్లందకుంట: నాగుల పంచమి సందర్భంగా మంగళవారం మండలంలోని శ్రీరాములపల్లి శ్రీ సంతాన నాగశివసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. నాగదేవతకు పూజలు, నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పుట్టలో పాలుపోసి చల్లగా చూడాలని నాగదేవతను వేడుకున్నారు.

రామడుగు: మండలంలోని ఆలయాల వద్ద మహిళలు పుట్టలో పాలు పోసి నాగదేవతకు పూజలు చేశారు.

శంకరపట్నం: కేశవపట్నం, కొత్తగట్టు, తాడికల్, మొలంగూర్‌లోని ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు.

మానకొండూర్: నాగుల పంచమి పురస్కరించుకొని మహిళలు గ్రామాల సమీపంలోని పుట్టల్లో పాలుపోసి అందరిని చల్లగా చూడాలని, పంటలు బాగా పండాలని, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని వేడుకున్నారు.

జమ్మికుంట: పట్టణంలోని శ్రీవిశ్వేశ్వరస్వామి(బొమ్మలగుడి), రామాలయం, అయ్యప్పస్వామి, శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయల్లో నాగుల పంచమి పురస్కరించుకొని మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. పుట్టలో పాలు పోసి పూలు, పండ్లు నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.



ఇల్లందకుంట: మల్యాల ప్యాక్స్ భవన నిర్మాణ పనులు నిధుల లేమితో అర్ధంతరంగా నిలిచిపోయాయి. ప్రస్తుత ప్యాక్స్ బిల్డింగ్ గోడలు బీటలు వారి శిథిలావస్థకు చేరిందని, ఎప్పుడు కూలుతుందోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్ పాలనలో 2018లో సుమారు రూ.25 లక్షలతో భవన నిర్మాణం చేపట్టారని, మిగులు పనులకు పాలకులు, అధికారులు స్పందించాలని, నిధుల మంజూరుకు కృషి చేయాలని రైతులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
శివకుమార్, పంచాయతీరాజ్ ఏఈ, ఇల్లందకుంట, సెల్ నం.63015 38145

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

ఖాదర్‌గూడెంలో 'ఆరోగ్య మహిళ'



హెల్త్ క్యాంపు సందర్శనలో సుధారాజేంద్ర



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్



ఇంటింటి సర్వేలో అధికారులు, వైద్య సిబ్బంది

మానకొండూర్: మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని వైద్యాధికారి మైథిలీ సూచించారు. మండలంలోని ఖాదర్‌గూడెంలో ఆరోగ్య మహిళా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు వివిధ పరీక్షలు చేసి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. అనారోగ్యానికి గురైతే వెంటనే వైద్యాధికారులను సంప్రదించాలన్నారు.

అన్నారంలో ఇంటింటి సర్వే

మండలంలోని అన్నారంలో డెంగీ ముందస్తు నివారణ కోసం జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రాజగోపాల్ ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్యశాఖ కరీంనగర్, మానకొండూరు పీహెచ్‌సీ సిబ్బంది మంగళవారం ఇంటింటా సర్వే నిర్వహించారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో నిల్వ నీటిని పారబోయించారు. దోమలు వృద్ధి చెందకుండా మందులు పిచికారీ చేయించారు. ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎంపీడీవో వరలక్ష్మి మాట్లాడుతూ.. గ్రామాల్లోని మురుగు కాలువలు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచుకోవాలని వ్యక్తిగత రిశుభ్రత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ హెల్త్ క్యాంపు సందర్శన

జమ్మికుంట: వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసుకుంటూ ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని కరీంనగర్ అడిషనల్ డీఎంహెచ్‌వో డా. సుధారాజేంద్ర అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధి కొత్తపల్లిలో ఇంటిగ్రేటెడ్ హెల్త్ క్యాంపును సందర్శించారు. సీజనల్ వ్యాధుల బారినపడకుండా అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో వావిలాల పీహెచ్‌సీ వైద్యులు రాజేష్, ఎంఎల్‌హెచ్‌పీ డా.బిందు, హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్‌రెడ్డి, సూపర్‌వైజర్లు అరుణ, దేవేందర్‌రెడ్డి, ఐసీటీసీ కౌన్సిలర్ మహిపాల్, ల్యాబ్ టెక్నీషియన్ ఇబ్రహీం, హెల్త్‌అసిస్టెంట్ నరేందర్, ఏఎన్‌ఎం వాణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు



సభ్యత్వం అందిస్తున్న తిరుపతిరావు

రామడుగు: ఎమ్మెల్సీ మల్క కొంరయ్య సహకారంతో ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు అన్నారు. మండలంలోని కొక్కెరకుంట, వన్నారం, మోతె, రుద్రారం, వెంకట్రావుపల్లి, గుండి, గోపాల్‌రావుపేట గ్రామాల్లో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రామడుగు మండల అధ్యక్ష, కార్యదర్శులు ప్రేమ్‌చంద్రారెడ్డి, ఐలయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు రాజశేఖర్, తిరుపతి, రవీందర్‌రావు, లక్ష్మీరాజం, వినయ్‌కుమార్, జలపతిరెడ్డి, హన్మాండ్లు, వీర్‌పాల్‌రెడ్డి, జానకిదేవి, హరిప్రియ, ప్రశాంత్‌కుమార్ పాల్గొన్నారు.

శబ్దబ్రహ్మ సినారె

కరీంనగర్‌కల్చరల్: తెలుగు భాషపై ఎనలేని సాధికారత కలిగిన శబ్దబ్రహ్మగా సినారె చారిత్రక సాహితీవేత్త అని ఎస్సారార్ కళాశాల తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు కొనియాడారు. తెలంగాణ రచయితల వేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం జరిగిన సినారె జయంతి సభలో మాట్లాడారు. ఆయన సాహిత్యంలో మానవతావాదం వెల్లివిరిసిందన్నారు. తెరవే జిల్లా అధ్యక్షుడు సీవీ కుమార్ అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో కవులు అన్నవరం దేవేందర్, పీఎస్ రవీంద్ర, నడిమెట్ల రామయ్య, దామరకుంట శంకరయ్య, విలాసాగరం రవీందర్ తదితరులున్నారు.

కాంగ్రెస్ పాలనలో అర్హులందరికీ రేషన్‌కార్డులు

• ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



లబ్ధిదారులతో ఎమ్మెల్యే, కలెక్టర్ పమేలా సత్పతి

గంగాధర: బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని, కాంగ్రెస్ పాలనలో అర్హులందరికి రేషన్‌కార్డులు అందిస్తామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండలంలోని మంగపేట ఫంక్షన్ హాల్‌లో మంగళవారం కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి నూతన రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. మండలంలో 5115 మందికి కొత్త రేషన్ కార్డులు మంజూరయ్యాయని, రాష్ట్రంలో కార్డుల పంపిణీ పండుగలా సాగుతుందన్నారు. గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నపుడు రేషన్‌షాపుల ద్వారా 9 రకాల నిత్యవసర సరుకులు అందజేసిందని, బీఆర్ఎస్ దొడ్డు బియ్యం పంపిణీ చేస్తే ఇప్పుడు కాంగ్రెస్ సన్న బియ్యం పంపిణీ చేస్తుందన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదగడమే ధ్యేయంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని, చొప్పదండి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామన్నారు. నారాయణపూర్ రిజర్వాయర్, కుడికాలువ పనులు పూర్తి చేసి పూర్తి స్థాయిలో సాగు నీరందిస్తామన్నారు. కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ.. చాలా కాలంగా ప్రజలు రేషన్ కార్డులు అడిగి అలిసి పోయారని, ప్రభుత్వం నూతన రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనుపమరావు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జాగిరపు రజిత శ్రీనివాస్‌రెడ్డి, వెలిచాల తిరుమల్‌రావు, వేముల భాస్కర్, తోట కరుణాకర్, పురమల్ల మనోహర్, దుబ్బాసి బుచ్చయ్య, రామిడి రాజిరెడ్డి, సత్తు కనుకయ్య, రోమాల రమేశ్, అజయ్‌రావు, కర్ర విద్యాసాగర్‌రెడ్డి, గుజ్జుల బాపురెడ్డి పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ



జమ్మికుంట: విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్ ఎదుట ఆగస్టు 1న నిర్వహించే ధర్నా విజయవంతం చేయాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ(యూఎస్‌పీసీ) నాయకులు కోరారు. మంగళవారం జమ్మికుంట బాలుర పాఠశాల ఆవరణలో ధర్నా కరపత్రం ఆవిష్కరించారు. బదిలీలు, పదోన్నతి, పీఆర్సీ అమలుతోపాటు పెండింగ్ డీఏలు విడుదల చేయాలన్నారు. సీపీఎస్ రద్దు చేసి పాత పింఛన్ విధానం అమలు చేయాలలన్నారు. యూఎస్‌పీఎస్ సంఘాల బాధ్యులు, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు నరహరి, టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు అవినాష్, జిల్లా కార్యదర్శి తిరుపతి, ఉపాధ్యాయులు వేణుమాధవ్, రాజేందర్, సదానందం, చంద్రశేఖర్, వనజ, యేసుమణి, స్వామి, సంపత్ పాల్గొన్నారు.

దళారులను నమ్మొద్దు

గంగాధర: రెవెన్యూకు సంబంధించి ప్రజలు, రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని నేరుగా ఆఫీసు పని వేళల్లో సంప్రదించాలని తహసీల్దార్ అనుపమరావు సూచించారు. మంగళవారం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పలు ఫిర్యాదులపై వివరణ ఇచ్చారు. ఓ వ్యక్తి తన భూమిని వదినకు సేల్ డీడ్ చేశాడు. ఆమె మరొకరికి అమ్ముకుంది. రిజిస్ట్రేషన్ నిలిపివేయాలని సేల్ డీడ్ చేసిన వ్యక్తి ఫిర్యాదు చేశాడు. తాను అమ్మిన భూమిపై ఫిర్యాదు చేయడం వల్ల పరిగణనలోకి తీసుకోలేదన్నారు. తప్పుడు ఆరోపణలతో ఫిర్యాదు చేయడం సరికాదన్నారు. ఆఫీసు సిబ్బంది ఎవరూ డబ్బులు వసూలు చేయరని, అలా ఎవరైనా డిమాండ్ చేస్తే ఫిర్యాదు చేయాలని సూచించారు.

భూ భారతి దరఖాస్తులకు త్వరలో పరిష్కారం



దరఖాస్తులను పరిశీలిస్తున్న తహసీల్దార్

చిగురుమామిడి: మండలంలోని భూభారతి దరఖాస్తులకు త్వరలో పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ రమేశ్ మంగళవారం తెలిపారు. 2600 మంది రైతులు భూ భారతి గ్రామసభల్లో దరఖాస్తులు చేసుకున్నారని, వాటిని పరిశీలించి నోటీసులు జారీ చేస్తామన్నారు. ఎలాంటి సమస్యలను లేని దరఖాస్తులను సత్వరమే పరిష్కరిస్తామన్నారు. సాదాబైనామాలతో కొనుగోలు చేసిన భూములకు ఇరువర్గాలు రావాల్సి ఉంటుందని, ప్రతి దరఖాస్తుదారుడికి నోటీసులు అందిస్తామన్నారు.

ఇళ్ల పంపిణీలో అవకతవకలు

సైదాపూర్: మండలంలోని వెన్నంపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల పంపిణీలో పంచాయతీ కార్యదర్శి రామగిరి హరీశ్, సిబ్బంది అక్రమాలకు పాల్పడ్డారని, అనర్హులకు ఇళ్లు మంజూరు చేయించారని గ్రామస్తులు హుజూరాబాద్ ఆర్డీవోకు మంగళవారం ఫిర్యాదు చేశారు. నిరుపేదలకు ఇళ్లు మంజూరు చేయకుండా భూస్వాములు, ఇళ్లు ఉన్న వారికి వచ్చేలా చేశారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు విచారణ జరిపి అర్హులకు ఇళ్లు కేటాయించాలని ఫిర్యాదులో కోరారు.

సంక్షిప్త వార్తలు

• యూరియా పంపిణీ

శంకరపట్నం: యూరియా కోసం మండలంలోని మెట్‌పల్లి సహకార సంఘం గోదాంకు మంగళవారం తెల్లవారుజామునే రైతులు చేరుకొని చెప్పులు వరుసలో పెట్టారు. ఓ రైతు సోషల్ మీడియాలో విషయాన్ని పోస్టు చేయడంతో సహకార సంఘం సిబ్బంది ఉదయం ఏడు గంటలలోపే గోదాంకు చేరుకున్నారు. ఒక్కో రైతుకు రెండు బస్తాలను అందించారు. యూరియా కొరత లేకుండా పంపిణీ చేస్తున్నామని సీఈవో సదయ్య స్పష్టం చేశారు.

• కార్యకర్తలు కష్టపడి పనిచేయాలి

రామడుగు: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ విజయానికి ప్రతీ కార్యకర్త కష్టపడి పని చేయాలని పార్టీ మండల ప్రభారి జాడి బాల్‌రెడ్డి కోరారు. మండలంలోని వెలిచాల గ్రామంలో మంగళవారం నాయకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు జిన్నారం విద్యాసాగర్, నాయకులు పలువురు పాల్గొన్నారు.

• ఎమ్మెల్సీ కవితను కలిసిన సతీశ్

జమ్మికుంట: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో మంగళవారం తెలంగాణ యూత్ ఆర్గనైజేషన్ ద్వారా సేవలు అందిస్తున్న పట్టణానికి చెందిన ఇమ్మడి సతీశ్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆర్గనైజేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు కవిత అభినందించారని, మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని సతీశ్ తెలిపారు.

• గుంతలు పూడ్చివేత

రామడుగు: మండలంలోని గుండి గ్రామ ఊర చెరువు వద్ద బ్రిడ్జిపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు సత్యప్రసన్న సహకారంతో మంగళవారం గుంతలు పూడ్చివేయించారు. గుంతలు పూడ్చడంతో వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్థిక సాయం

శంకరపట్నం: మండలంలోని వంకాయగూడెం గ్రామంలో ఇటీవల విద్యుత్‌షాక్‌తో మృతిచెందిన ఆటోడ్రైవర్ మూల రాకేశ్ కుటుంబాన్ని కేశవపట్నం స్వయంకృషి ఆటోయూనియన్ సభ్యులు మంగళవారం పరామర్శించి రూ.40 వేలు అందించారు. మృతుడి కుటుంబానికి అండగా ఉంటామని భరోసానిచ్చారు.

• సన్మానం

జమ్మికుంట: పట్టణానికి చెందిన మున్నూరుకాపు సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లయ్య, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్‌ను మున్నూరుకాపు ఉద్యోగుల సంఘం నాయకుడు అవినాష్ ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం శాలువాలతో సన్మానించారు. అనంతరం మున్నూరుకాపులు ఐక్యంగా రాజకీయ, ఆర్థిక, హక్కుల కోసం ఉద్యమించాలన్నారు.

• పెరటితోటల పెంపకంపై అవగాహన

వీణవంక: మండలంలోని వల్బాపూర్ గ్రామంలో పెరటి తోటలు, ఆహార భద్రతపై అంగన్‌వాడీ కార్యకర్తలకు సెక్టార్ మీటింగ్‌లో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కేవీకే శాస్త్రవేత్త ప్రశాంతి మాట్లాడుతూ... పేరటి తోటల పెంపకం వివరించారు. అనంతరం కూరగాయల సీడ్స్ కిట్లు పంపిణీ చేశారు. సీడీపీవో సుగుణ, హుజూరాబాద్ డీసీ నాగరాజు, సూపర్‌వైజర్ రమాదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

• ముగ్గురిపై కేసు

వీణవంక: మండల కేంద్రంలోని శ్రీకనకదుర్గ వైన్స్ దుకాణంలో పని చేస్తున్న ముగ్గురు వ్యక్తులు అదే షాపు యజమానిని మోసం చేసినందుకు కేసు నమోదు చేశామని ఎస్సై ఆవుల తిరుపతి తెలిపారు. మెట్టుపల్లి, అన్నారం, లింగాపూర్ గ్రామాలకు చెందిన గుర్రం దేవరాజు, పూదరి రతన్, పచ్చిమట్ల శ్రీనివాస్ యజమానికి తెలియకుండా నగదు కాజేశారని యజమాని మార్క సంపత్‌గౌడ్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

వివాహిత అదృశ్యం..

జమ్మికుంట: ఓవివాహిత అదృశ్యం కేసు నమోదు చేశామని టౌన్ సీఐ రామకృష్ణ తెలిపారు. ఇల్లందకుంట మండలం శ్రీరాములపల్లికి చెందిన ఓ వ్యక్తి జమ్మికుంటలో ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటూ మున్సిపల్ పరిధి కొత్తపల్లిలో భార్య, ఇద్దరు పిల్లలతో నివాసం ఉంటున్నాడు. కాగా సోమవారం తెల్లవారుజామున భార్య ఇంటి నుంచి వెళ్లి పోయిందని గుర్తించి ఆచూకీ కోసం వెతికిన ఫలితం లేకపోవడంతో భర్త ఫిర్యాదుతో మంగళవారం కేసు నమోదు చేశామని సిఐ వివరించారు.

• రోడ్డు ప్రమాదంలో గాయాలు

గంగాధర: కరీంనగర్-జగిత్యాల ప్రధాన రోడ్డు మండలంలోని మధురానగర్ చౌరస్తాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు గాయాలపాలయ్యాడు. కొడిమ్యాల మండలం నమిలికొండ కు చెందిన బొల్లుమల్ల ఆనంద్ ఎక్సెల్‌పై వెళ్తూ ప్రమాదవశాత్తు కింద పడిపోయాడు. ప్రమాదంలో ఆనంద్ తలకు తీవ్ర గాయాలుకావడంతో స్థానికులు అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు.

శంకరపట్నం: మండలంలోని తాడికల్ గ్రామంలో సోమవారం అర్ధరాత్రి ఆగి ఉన్నలారీని ఆటో ఢీకొనడంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరికి గాయాలయ్యాయని స్థానికులు తెలిపారు. ములుగు జిల్లా ఆత్మకూర్ మండలానికి చెందిన బాషబోయిన రాకేశ్(35), రోజారామణి ఆటోలో వేములవాడ రాజన్నను దర్శించుకొని తిరిగి వెళ్తుండగా ప్రమాదం జరిగిందని 108లో హుజూరాబాద్ ఆస్పత్రికి తరలించామన్నారు.

• తప్పిన పెనుప్రమాదం

చిగురుమామిడి: మండలంలోని సుందరగిరి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం ఎదుట మంగళవారం మధ్యాహ్నం హుస్నాబాద్-కరీంనగర్ ఆర్ అండ్‌బీ ప్రధాన రోడ్డుపై గ్రానైట్ లారీ కల్వర్టు గోడపైకి ఎక్కింది. హుస్నాబాద్ నుంచి కరీంనగర్ వెళ్తున్న లారీ ఓ యువకుడిని ఢీకొట్టబోయి కల్వర్టుపైకి ఎక్కింది. ప్రాణాలు కాపాడుకునే ప్రయత్నంలో భిక్షపతి అనే యువకుడు కల్వర్టు కిందికి దూకాడు. స్థానికులు డ్రైవర్‌ను నిలదీయగా తప్పించుకునే ప్రయత్నంలో కోతిబొమ్మ గద్దెను ధ్వంసం చేసుకుంటూ వెళ్లిపోయాడు. పోలీసులు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని బాధితుడు, స్థానికులు కోరారు.

• డబ్బుల కోసం రూంలో బంధింపు

జమ్మికుంట: ప్రైవేటు విద్యుత్ బిల్ కలెక్షన్ ఏజెన్సీ కాంట్రాక్టర్‌ను బంధించిన సంఘటన మంగళవారం పట్టణంలో చోటు చేసుకుంది. జమ్మికుంటకు చెందిన నరేంద్రాచారి వద్ద పట్టణానికి చెందిన రచ్చ సతీశ్, శ్రీపతి రమేశ్ బిల్ కలెక్టర్లుగా పనిచేశారు. నరేంద్రాచారి ఒక్కొక్కరి నుంచి రూ.రెండులక్షలు డిపాజిట్ చేయించుకున్నాడు. కాంట్రాక్టు పూర్తయినా అసలు ఇచ్చి మిత్తి ఇవ్వడం లేదంటూ రూంలో బంధించారు.

'మంత్రి ఆరోపణలు సరికాదు'

జమ్మికుంట: రాష్ట్రానికి కేంద్రం ఎరువులు ఇవ్వడంలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడటం సరికాదని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు అన్నారు. మంగళవారం పట్టణంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులను పట్టించుకోవడం లేదని, వానాకాలం సాగుకు మందే ఎరువుల అవసరంపై కేంద్రానికి నివేదిక ఇవ్వకుండా ఆరోపణలు చేయడం రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమేనని విమర్శించారు. వ్యవసాయశాఖ మంత్రి వాస్తవాలు తెలుసుకొని రైతులను ఆదుకోవాలని లేదంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

విద్యార్థుల క్షేత్ర సందర్శన



మానకొండూర్: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆరో తరగతి విద్యార్థులు మంగళవారం కరీంనగర్‌లోని ఉజ్వలపార్కు, లోయర్ మానేరు డ్యామ్‌ను సందర్శించారు. కొత్తగా పాఠశాలలో చేరిన విద్యార్థులకు బడిపై ఆసక్తి, హాస్టల్ విద్యార్థులకు ఇంటి బెంగ తగ్గించడానికి క్షేత్ర పర్యటన ఎంతో ఉపయోగపడుతుందని హెచ్‌ఎం డి. శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి. నళిని, ఎం.శ్రీనివాస్, యస్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.